పార్క్ చేసిన కారును తొలగించిన పోలీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంగళరావునగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తాగునీరు సరఫరా చేసే వాల్వ్ పైన పార్కింగ్ చేసిన కారును పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు ఆదివారం తొలగించారు. తాగునీరు సరఫరా చేసే వాల్వ్ పైన కారు పార్కింగ్, మధురానగర్ డి-బ్లాక్‌కు నిలిచిన నీటి సరఫరానే కథనాన్ని ఈ నెల 6న ఆంధ్రజ్యోతి ప్రచురించింది. స్పందించిన పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసులు క్రేన్ ద్వారా తాగునీటిని సరఫరా చేసే వాల్వ్‌పై నుంచి కారును తొలగించారు. నిబంధనలకు వ్యతిరేకంగా రహదారిపై కారును నిలిపినందుకు పోలీసులు జరిమానా విధించారు. కారును తొలగించినా డి-బ్లాక్ వాసులకు మంచినీరు సరఫరా కాలేదు. సోమవారం ఉదయం ఎక్కువ సేపు నీటిని సరఫరా చేయాలని స్థానికులు జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు.


నీటి సరఫరా చేసే వాల్వ్‌పై ఉన్న కారును తొలగిస్తున్న పోలీసులు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న డా.అమరేష్‌రావు, హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధులు

యాక్టివ్ లైఫ్‌స్టైల్‌పై వర్క్‌షాపు

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో రన్నింగ్, వెల్‌నెస్, యాక్టివ్ లైఫ్‌స్టైల్‌పై మీడియా ప్రతినిధులకు వర్క్ షాప్ జరిగింది. నిమ్స్ డాక్టర్ అమరేష్‌రావు, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ఫిట్‌నెస్ కోచ్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రోజూ వ్యాయామం చేయాలని వారు సూచించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, సీనియర్ జర్నలిస్టులు, హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధులు, పాల్గొన్నారు.


తొలి ఏకాదశి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ సంగీతశ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న పూజారి

ఘనంగా తొలి ఏకాదశి

ఎర్రగడ్డ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని ఆదివారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు దేవాలయాలకు భక్తులు తెల్లవారుజాము నుంచి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని వివిధ రకాల పూలు, ఆకుకూరలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, ఆలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆలయ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి ఎంవీ రెడ్డి, ఆలయ మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతశ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అర్జున్ యాదవ్, వార్డు మెంబర్ నాగరాజు పాల్గొన్నారు.


ప్రజాచైతన్యం పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తాం

● ప్రజా చైతన్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కాకుండా, క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని ప్రజా చైతన్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లెద్దు శంకర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ జెండాను, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బైరోజు సూర్యప్రకాశ్, కార్యదర్శులు వెంకటేష్, వేముల రాము, భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు చిత్రాన్ని నిలిపివేయాలి

● బీసీ ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ శివముదిరాజ్

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బహుజనుల ఆత్మగౌరవాన్ని తుంగలో తొక్కే విధంగా ఉన్న హరిహర వీరమల్లు చిత్రాన్ని వెంటనే నిలిపివేయాలని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ శివముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాలు, ఓయూ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజావీరుడు పండుగ సాయన్న చరిత్రను వక్రీకరించేలా సినిమాను రూపొందించారని, దాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. బహుజనులకు చిత్ర బృందం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చిత్రం విడుదలైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. త్వరలోనే పవన్‌కల్యాణ్‌ను, రాష్ట్ర మంత్రులను కలుస్తామని, హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో మల్లికార్జున్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మహిళా నాయకులతో కార్పొరేటర్ దేదీప్య

జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయం

వెంగళరావునగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో త్వరలో జరిగే ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ ధీమా వ్యక్తం చేశారు. మధురానగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకటరమణమ్మ, విజయాగౌడ్, రాజమ్మ, లక్ష్మి, కృష్ణవేణిలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కార్పొరేటర్ పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కార్పొరేటర్ పార్టీ నాయకులకు సూచించారు.

రహదారులు ఇలా.. రోగులకు నడక ఎలా..?

● ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో అధ్వానంగా రోడ్లు
● ఇబ్బందులు పడుతున్న రోగులు
● పట్టించుకోని అధికారులు

ఎర్రగడ్డ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మానసిక వైద్యానికి ప్రధాన కేంద్రంగా ఉన్న ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో రోడ్లు అధ్వానంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లను పునర్నిర్మించకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు గుంతల రోడ్లపైనే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పురుషుల వార్డు, స్త్రీల వార్డు, కోర్టు వార్డులకు వెళ్లే రోడ్లయితే మరీ అధ్వానంగా తయారయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు తేలి ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రోడ్లపై వీల్‌చైర్లలో రోగులను తీసుకెళ్తున్నప్పుడు వారు కింద పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రధాన ద్వారం నుంచి అవుట్ పేషెంట్ విభాగానికి వెళ్లే రోడ్డు కొంతమేరకు మట్టి రోడ్డుగానే ఉండడంతో వాహనాలు వెళ్తుంటే దుమ్ము లేస్తుంది. దీంతో రోగులు వారి బంధువులు ఊపిరి ఆడడం లేదని వాపోతున్నారు. నూతన రహదారిని నిర్మించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.


గుంతలమయమైన మహిళా వార్డుకు వెళ్లే రహదారి

దశాబ్దాలుగా మారని రోడ్లు..

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా చికిత్స కోసం మానసిక రోగులు ఇక్కడకు వస్తుంటారు. చికిత్స బాగానే అందుతున్నా.. రోడ్లు ఇబ్బంది పెడుతున్నాయని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో సుమారు 600 పడకలు ఉన్నాయి. రోజు ఆస్పత్రిలో సేవలు పొందేందుకు వెయ్యి మంది వస్తుంటారు. దశాబ్ద కాలం నుంచి ఎటువంటి రోడ్డు నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లన్ని పూర్తిగా గుంతలు తేలి అధ్వానంగా తయారయ్యాయి. ఇదిలా ఉండగా.. నడవలేని స్థితిలో ఉన్న రోగులను ఒకచోట నుంచి మరోచోటకు వీల్‌చైర్‌లో తీసుకెళ్లాల్సి ఉంటుంది. అవుట్ పేషెంట్ విభాగం నుంచి వివిధ వార్డులకు తరలించే అన్ని రోడ్లు పూర్తి గుంతలమయంగా ఉండడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సార్లు రోగులను వీల్ చైర్‌లలో తరలించే సిబ్బంది అశ్రద్ధ మూలంగా కూడా రోగులు కింద పడుతున్నారని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, మంత్రులు స్పందిస్తుంటారు. ఆస్పత్రిని సందర్శించి హడావిడి చేస్తుంటారు తప్పా ఆస్పత్రి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిలో రోడ్లను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


అవుట్ పేషెంట్ విభాగం ప్రాంతంలోని మట్టి రోడ్డు


ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి

రోడ్ల మూలంగా ఇబ్బందులు పడుతున్నాం

మానసిక ఆస్పత్రిలో అధ్వానంగా ఉన్న రోడ్ల మూలంగా అనేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై వాహనాల్లో వెళ్లాలన్నా, కాలినడక వెళ్లిన ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. ఎన్నో సంవత్సరాలుగా ఆస్పత్రికి వస్తున్నాం. రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఆస్పత్రిలో నూతన రోడ్లు నిర్మించాలి.

- వరంగల్, రోగి బంధువు

రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు

ఆస్పత్రిలో రోడ్లను నిర్మించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవన నిర్మాణం మూడు నెలల్లో పూర్తవుతుంది. అక్టోబర్, నవంబర్ నెలలో భవనాన్ని ప్రారంభించిన అనంతరం రోడ్ల నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ భవనం ప్రారంభం కాగానే నూతన రోడ్ల నిర్మాణానికి టెండర్లు వేసి త్వరలోనే నూతన రహదారిని ఏర్పాటు చేస్తాం.

- డాక్టర్ అనిత రాయరాల, ఎర్రగడ్డ మానసిక ఆస్పతి సూపరింటెండెంట్

అణగారిన వర్గాల గొంతుక జగ్జీవన్‌రామ్


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శేఖర్‌రెడ్డి


ప్రేమ్‌నగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్


ఖైరతాబాద్ బీజేఆర్ నగర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుమార్

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని కాంగ్రెస్ రాష్ట్ర యువజన మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవి శేఖర్‌రెడ్డి కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్‌కుమార్, నాగరాజు, గురునాథ్‌రావు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ: ఎర్రగడ్డ, ప్రేమ్‌నగర్ ప్రాంతాలలో పలువురు దళిత నాయకులు బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గంటా మల్లేష్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణకుమార్, కాంగ్రెస్ నాయకుడు రవిగౌడ్ పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: జూబ్లీహిల్స్ డివిజన్ బీజేఆర్ నగర్ బస్తీలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోవర్ధన్‌రెడ్డి నాయకులు ప్రభాకర్, నరసింహ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేట: జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఖైరతాబాద్: మాజీ ఉపప్రధాని, దివంగత బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీజేఆర్ నగర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కుమార్ మాదిగ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శివకుమార్, అశోక్, భానుప్రకాష్, గోవింద్, వెంకటేష్, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం


సలీంబాబానగర్‌లో షర్బత్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి


ఖైరతాబాద్ గ్రంథాలయ చౌరస్తాలోని దర్గాలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి

బోరబండ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక మొహర్రం అని బోరబండ డివిజన్ కార్పొరేటర్ ఎండీ బాబా ఫసియుద్దీన్ అన్నారు. బోరబండ భారత్‌నగర్‌లో పీర్లను ఆదివారం సందర్శించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నెలకొల్పిన పీర్లను స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూం, మహేష్ కాసులగౌడ్, రజ్వీ, రజాక్, ఆనంద్, వెంకటేశ్, దేవేందర్, బాలరాజ్‌గౌడ్, జావేద్, మహేందర్ పాల్గొన్నారు.

పంజాగుట్ట: బిస్తీవాడ ఏసీగార్డ్స్ లోని రహ్మనియా మసీదును కార్పొరేటర్ విజయారెడ్డి ఆదివారం సందర్శించారు. మసీదులోని సమస్యలను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: త్యాగానికి ప్రతీక మొహర్రం అని కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని పలు బస్తీల్లో జరిగిన మొహర్రం ఊరేగింపుల్లో ఆయన పాల్గొని దట్టీలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

● సీఐటీయూ సీనియర్ నాయకుడు అశోక్

ఎర్రగడ్డ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు రాపర్తి అశోక్ ప్రజలు, కార్మికులను కోరారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన పోస్టరును ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రి వద్ద యూనియన్ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని చెప్పారు. సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సైదయ్య, లింగయ్య, ఓంప్రకాష్, శ్రీధర్, భాగ్యమ్మ, లక్ష్మి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె పోస్టరును ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

యాంటీ రేబిస్‌తో జూనోసిస్ రోగాలకు చెక్

పద్మారావునగర్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): బోయగూడలోని పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వాక్సిన్‌ను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అయోధ్య మాట్లాడుతూ ఏటా జూలై 6వ తేదీని ప్రపంచ జూనోసిస్ డేగా నిర్వహిస్తామని, 1885 జూలై 6న లూయీపాశ్చర్ శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా రేబిస్ వ్యాధినిరోధక టీకాను తయారు చేసి పిచ్చికుక్క కరిచిన 9 సంవత్సరాల బాలుడిపై ప్రయోగించి విజయం సాధించారని తెలిపారు. బాలుడికి ప్రాణాపాయం తప్పడంతో అప్పటి నుంచి ఏటా జూలై 6ను జూనోసిస్ డేగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధులను జూనోసిస్ వ్యాధులంటారని, వీటివల్ల ఏటా దేశంలో 30 నుండి 40 వేల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా కలుషిత నీరు, గాలి, పాలు, మాంసం ద్వారా ఎక్కువగా వ్యాప్తిస్తుందని, వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవుల ద్వారా వివిధ రకాలుగా జూనోసిస్ వ్యాధులు వ్యాపించి ప్రాణాలు తీస్తాయని, వివిధ రకాల పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు దినేష్, స్వాతి, వెటర్నరీ అసిస్టెంట్లు రమేష్, ఉదయ్,కల్యాణ్, సిబ్బంది హేమంత్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.


మార్జాలానికి వ్యాక్సిన్ వేస్తున్న ప్రొఫెసర్ అయోధ్య

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ ప్రశాసన్‌నగర్ ఆంధ్రాబ్యాంక్, సీఓడీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ మాదాపూర్ బీఎన్‌ఆర్ హిల్స్ రవీంద్రా సొసైటీ జింజర్ కోర్టు హోటల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ ఎర్రగడ్డ, శంకర్‌లాల్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ప్రేమ్‌నగర్, ట్రాన్సిట్ హాస్టల్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ ఎయిర్‌పోర్టు హంగర్స్, కాచే ప్రాపర్టీస్, జయశంకర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.


ప్రతిభా పురస్కారాలను అందుకున్న విద్యార్థులతో మాజీ ఎంపీ వెంకటేశ్

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

ఖైరతాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలు, ఉన్నత విద్యలో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) బ్యాంక్ మెన్‌చాప్టర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఖైరతాబాద్ వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పాల్గొని 70 విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పీవీ రమణయ్య, ఎమ్మెల్సీ దయానంద్, తెలంగాణ వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, వ్యాపారవేత్తలు ఉప్పల శ్రీనివాస్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపులోకి దూసుకొచ్చిన కారు

● తప్పిన ప్రమాదం

యూసుఫ్‌గూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని ఓ పెట్రోల్ బంకులో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఉదయం ఓ ట్యాక్సీ కారు అతివేగంగా వచ్చి పెట్రోల్ బంక్‌లోని పెట్రోల్ పోసే యంత్రాన్ని ఢీకొట్టింది. దీంతో చుట్టూ పక్కల ఉన్న వాళ్లంతా పరుగులు తీశారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు గుర్తించారు. పెట్రోల్ బంక్ నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తి అదృశ్యం

పంజాగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన వాసుదేవ ఈ నెల 2న కేశవనగర్‌లోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో చదువుతున్న తన పిల్లలకు మధ్యాహ్నం భోజనం ఇవ్వడానికి వెళ్లాడు. చీకటి పడిన అతను తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టూ పక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆదివారం వాసుదేవ కుటుంబ సభ్యులు పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పంజాగుట్ట ఎస్ఐ వెంకటకిషన్ తెలిపారు.

అల్లుడిపై అత్త ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూతురిని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న అల్లుడిపై అత్త మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన రత్లావత్ రవికి రహమత్‌నగర్‌కు చెందిన యువతి తో వివాహమైంది. రవి మద్యం సేవిస్తూ కూతురిని మానసికంగా ఇబ్బందులు పెడుతూ శారీరకంగా హింసిస్తున్నాడని అత్త బచని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చాంపియన్స్ కప్ విజేత కంచన్‌బాగ్

హైదరాబాద్: సాకర్ చాంపియన్స్ కప్ 8వ సీజన్ అండర్-7 టైటిల్‌ను కంచన్‌బాగ్ జట్టు కైవసం చేసుకుంది. బొల్లారం ఫ్రెండ్స్ క్లబ్ నిర్వహించిన ఈ పోటీల ఫైనల్లో కంచన్ బాగ్ జట్టు 1-0తో జీకేఎల్ టీమ్‌పై గెలిచింది. అండర్-9 విభాగంలో స్పోర్ట్ ఓ ఫిట్ జట్టు 2-1తో సెయింట్ మైకెల్స్‌పై నెగ్గి ట్రోఫీ దక్కించుకుంది.



అమ్మవారిని దర్శించుకున్న ఈటల రాజేందర్

భక్తులతో కిటకిటలాడిన తోట ముత్యాలమ్మ ఆలయం

తిరుమలగిరి జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం రెండో ఆదివారం బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన లాంటి పూజలు నిర్వహించారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయం ప్రధాన అర్చకులు చిక్కాల మహేష్ రావు ఎంపీకి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బొల్లారం సదర్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. రాష్ట్ర టీపీసీసీ కార్యదర్శి నరసింహన్ కన్నన్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జీవి బాల్‌రాజ్, నాగేందర్, పూర్ణచందర్ పాల్గొన్నారు.



హారతి తీసుకుంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేవి బోనాల ఉత్సవాలు

రెజిమెంటల్‌బజార్, జూలై 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి చాటి చెప్పే బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ ఆదయ్యనగర్‌లో నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సంఘం శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు తలసాని ధర్మేందర్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, నాగులు, ఆకుల హరికృష్ణ పాల్గొన్నారు.



బొల్లారం తోట ముత్యాలమ్మ దేవాలయం

ఆషాఢమాస బోనాలకు దేవాలయాల ముస్తాబు

తిరుమలగిరి జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల జాతరకు బొల్లారం, తిరుమలగిరిల్లోని అమ్మవారి దేవాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. బొల్లారం డౌటన్ బజార్‌లోని తోట ముత్యాలమ్మ దేవాలయానికి తీరొక్క రంగులను వేస్తున్నారు. ఉప ఆలయాన్ని కూడా ముస్తాబు చేస్తున్నారు. అదేవిధంగా లాల్‌బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖకు చెందిన శ్రీ మహంకాళి దేవాలయాన్ని కూడా రక రకాల రంగులు వేస్తున్నారు. దీంతోపాటు గోపురంపై ఉన్న అమ్మవారి విగ్రహాలకు రాళ్ల అద్దుతున్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా : తలసాని

పద్మారావునగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్‌లోని అభినవ నగర్ కాలనీ వాసులు ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కాలనీ వాసులు పలు సమస్యలను విన్నవించారు. అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయని తరచుగా మ్యాన్‌హోళ్లు ఓవర్ ఫ్లోఅయి రోడ్లపై నీరు ప్రవహిస్తోందని, ఓపెన్ జిమ్, స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలని, కమిటీ హాలులో మరో అంతసు నిర్మించాలని స్థానికులు తలసానికి విన్నవించారు. వారి సమస్యలను విన్న ఆయన సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేటర్ కుర్మ హేమలత,పద్మారావునగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ డీఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం కృష్ణ, కాలనీ అధ్యక్షులు దేశ్‌పాండే,రాజేశ్‌గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మిపతి, ఏసూరి మహేష్, మహేందర్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, అనిత, సునీతలు పాల్గొన్నారు.

గస్తీ పోలీసులను ఢీ కొట్టిన కారు

బోయినపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన చంటి, ప్రవీణ్ అనే కానిస్టేబుల్‌లు శనివారం అర్ధరాత్రి మిలటరీ డైరీ ఫామ్ రోడ్‌లో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో గుర్తుతెలియని ఓ కారు రాత్రివేళ రోడ్డు పక్కన నిలిపి ఉంచడంతో అనుమానం వచ్చిన తనిఖీ చేయడానికి వెళుతున్న క్రమంలో కానిస్టేబుళ్ల ద్విచక్ర వాహనాన్ని కారు డ్రైవర్ ఢీకొట్టి వెళిపోయాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు కాలు విరిగి తీవ్ర గాయాలు కాగా, చంటికి సైతం గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు ఆ కారు డ్రైవర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తెలిపారు. బోయినపల్లి పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా కారును, నిందితుడిని గాలిస్తున్నారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లను ఆదివారం ఏసీపీ పరామర్శించి, వైద్యులను వారి ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి

అడ్డగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ స్వాతి హోటల్ సమీపంలో అంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తుతెలియని 35 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రెజిమెంటల్‌బజార్‌లో తొలి ఏకాదశి సందర్భంగా సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డులో ఉన్న గణేష్ టెంపుల్‌లో గణపతి, శివుడు, వేంకటేశ్వరస్వామివార్ల దివ్య అలంకరణ



స్వామివారిని దర్శించుకున్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

రెజిమెంటల్‌బజార్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర వేంకటాద్రిస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం తులసీ అర్చనలు, సకలదోష నివారణ, సకల ఆరోగ్య ప్రాప్తికి లఘుపూర్ణాహుతి సాయంత్రం దివ్య రథోత్సవం సేవ నిర్వహించారు. ఆలయ చైర్మన్ అల్లాడి గౌరీశంకర్, ఈఓ సత్యనారాయణ, కమిటీ సభ్యులు నందికంటి రవి, శ్రీనివాస్, కీర్తివీరేష్, పరమేశ్వరి, రాజగోపాలచార్యులు పాల్గొన్నారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బౌద్ధనగర్‌లో

బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ తదితరులు పాల్గొని వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునిపూజలు చేశారు. స్వామివారిని వివిధ రకాల పువ్వులతో అందంగా అలకరించారు. నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ హేమ, ఆలయచైర్మన్ చందర్ తదితరులు పూజలు చేసి అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. సీతాఫల్‌మండి రామాలయం, బౌద్ధనగర్ రామాలయం, కనకదుర్గ ఆలయంతో పాటు తదితర ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలను చేశారు. శ్రీనివాస్‌నగర్ శ్రీగిరి ప్రసన్నవేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రుత్వికులు వేదా పారాయణం చేశారు.



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదాపారాయణం చేస్తున్న రుత్వికులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు

సికింద్రాబాద్, బోయినపల్లి, బౌద్ధనగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా లష్కర్‌లోని దర్గాలు కిటకిటలాడాయి. ముస్లిం సోదరులతోపాటు హిందువులు సైతం పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికార అనధికార ప్రముఖులు పాల్గొన్నారు. బోయినపల్లిలోని దర్గా హజరత్ సయిాద్ మిస్కిన్ షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, షకీబ్ హుస్సేన్, సులేమాన్, ముక్తార్, ఫజల్, మోని, నాదీమ్, అలీం తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. షర్బత్ పంపిణీ చేశారు. మహ్మద్ అస్గర్, మహ్మద్ అస్లాం, రఫీష్ మహ్మద్, శంకర్, డాల్‌రాజ్, ప్రశాంత్, ఇటికె గోపి, శ్రీను, చందప్ప, ఇస్మాయిల్ పాల్గొన్నారు. బౌద్ధనగర్ అంబర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ, నాయకులు పాక సాయి, సలీమ్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు. షర్బత్ పంపిణీ చేశారు.



బోయినపల్లిలోని దర్గా హజరత్ సయిాద్ మిస్కిన్ షా



బౌద్ధనగర్ అంబర్‌నగర్ చిల్లా వద్ద షర్బత్ పంపిణీ చేస్తున్న స్థానిక కార్పొరేట్ కంది శైలజ



బాలంరాయిలో జరిగిన కార్యక్రమంలో అన్నదానం చేస్తున్న పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

రాంగోపాల్‌పేట్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని సీఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాస్ కొనియాడారు. ఆదివారం సికింద్రాబాద్ పీజీరోడ్డులోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాలులో సంఘం స్వర్ణోత్సవ సంవత్సర(1974 - 2024) జ్ఞాపకార్థం గత సంవత్సరం ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ విద్యలో ప్రతిభను కనబరిచిన నిరుపేదలైన 50 మంది విద్యార్థులకు రూ.20 లక్షల విలువ గల స్కాలర్‌షిప్ చెక్కులను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేముల శ్రీనివాస్ ముందుగా స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేముల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సంఘం మూడు తరాలుగా ప్రజా సేవను కొనసాగిస్తున్నారని కొనియాడారు. అంతకు ముందు స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర మాట్లాడుతూ విద్యలో అత్యంత ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు రూ.20 లక్షల విద్యా స్కాలర్‌షిప్‌లను అందజేసిన ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అభినందనీయమన్నారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్ మాట్లాడుతూ మంచి కార్యక్రమం చేపట్టిన ఆర్యవైశ్య అభివృద్ధి సంఘ మరింత లక్ష్మీని సంపాదించాలని కోరుకుంటున్నానన్నారు. సంఘం అధ్యక్షులు సోమ దయానంద్ మాట్లాడుతూ ఉత్తమ విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 30 సంవత్సరాలుగా వెయ్యి రూపాయల చొప్పున 10-15 లక్షల రూపాయల అందించడం జరిగిందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి చీల విజయ్ కుమార్, కోశాధికారి ముస్త్యాల చంద్రశేఖర్, స్కాలర్‌షిప్ సబ్ కమిటీ చైర్మన్ పిప్పల విశ్వేశ్వరరావు, వీసంశెట్టి ప్రేమ్‌కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ప్రకాష్ అమ్మనబోలు, దొండు అజిత్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వేముల శ్రీనివాస్, చీర సుచిత్ర శ్రీకాంత్, నిర్వాహకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పబ్బతి శ్రీకృష్ణ

అగ్రకుల రాజకీయ పార్టీలను ఓడిస్తాం

రెజిమెంటల్‌బజార్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలల అస్తిత్వాన్ని తగ్గించిన అగ్రకుల రాజకీయ పార్టీలను స్థానిక ఎన్నికల్లో ఓడిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ గ్యాస్‌మండిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా అన్యాయం చేసి రోస్టర్ విధానంలో కూడా కుట్రలు చేసిన పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్యాస్‌మండిలో సీనియర్ నాయకులను కలిసి భవిష్యత్ కార్యచరణ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సంకీ ప్రసాద్ పాల్గొన్నారు.

చాంపియన్స్ కప్ విజేత కంచన్‌బాగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సాకర్ చాంపియన్స్ కప్ 8వ సీజన్ అండర్-7 టైటిల్‌ను కంచన్‌బాగ్ జట్టు కైవసం చేసుకుంది. బొల్లారం ఫ్రెండ్స్ క్లబ్ నిర్వహించిన ఈ పోటీల ఫైనల్లో కంచన్‌బాగ్ జట్టు 1-0తో జీకేఎల్ టీమ్‌పై గెలిచింది. అండర్-9 విభాగంలో స్పోర్ట్ ఒ ఫిట్ జట్టు 2-1తో సెయింట్ మైకెల్స్‌పై నెగ్గి, ట్రోఫీ దక్కించుకుంది. ఏఎఫ్‌సీ 'ఎ' లైసెన్స్ రెఫరీ ఈఎస్ శ్యామ్ విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు బహూకరించారు.

పద్మారావునగర్‌లో సాయి సప్తాహం

పద్మారావునగర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా శ్రీసాయి సప్తాహ ఉత్సవాల్లో భాగంగా పద్మారావునగర్‌లోని సాయిబాబా ఆలయంలో మూడవరోజు కార్యక్రమాల్లో భాగంగా శ్రీసాయి స్వర్ణాభిషేకం, అనంతరం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం సాయి ఆశ్రమంలో ఉన్న రావి, వేప వృక్షాలకు ఆశ్రమ ఉత్తమాధికారిణి కీర్తిమా మండపారాధన, నవగ్రహ పూజ, లక్ష్మీనారాయణ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీసాయి విష్ణుసహస్రనామార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, శ్రీసాయినాధుని దర్శించుకున్నారు. ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నామాలగుండులో మొక్కలు నాటుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తదితరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఏసీపీ శశాంక్‌రెడ్డి

బౌద్ధనగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరి బాధ్యత అని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్ రెడ్డి అన్నారు. ఆదివారం నామాలగుండు, మైలార్‌గడ్డ, పీస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నామాలగుండు చౌరస్తాలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయనతో పాటు చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమలు ముఖ్యఅతిథులుగా పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే వనమహోత్సవంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయస్వామి ఆలయచైర్మన్ చందర్, కాలనీవాసులు, పీస్‌కమిటీ సభ్యులు ప్రశాంత్, నర్సింగరావు, సాపరాజు, వెంకటేశ్, రాజేష్, రమేష్, శ్రీనివాస్, సూరి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ఘనంగా డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

అడ్డగుట్ట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనసాంగ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏక్ దేశమే దో విధాన్ దో ప్రధాన్ దో నిషాన్ నహీ చలేగా అని నినదించిన సాహసవంతుడు ఆయన అని అన్నారు. అదేవిధంగా తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హంసరాజు, వీరేశం, కృష్ణ, రాజశేఖర్, ఉదయ్ కుమార్, డివిజన్ కన్వీనర్ కళావతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గంటీరావుపేట సాయన్న, శివ ప్రసాద్, మోహన్, చిరంజీవి, రాజు, వసంత, బాబు, శ్యాం, రాజేష్‌లు పాల్గొన్నారు.

చిలకలగూడలో

మెట్టుగూడ, ఆలుగడ్డ బావి, అంబేద్కర్ విగ్రహం వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆదర్శ్ ముదిరాజ్, మేకల చంద్రశేఖర్, రాజేష్ తదితరులు.

లష్కర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులు



పాట్నీగుట్ట చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్



సీతాఫల్‌మండిలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అడుగు జాడల్లో నడిచి, దేశాభివృద్ధికి పాటు పడాలని యువతకు పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతి సందర్భంగా సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, దళిత, కార్మిక సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలంరాయి జంక్షన్‌లోని బాబా జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లు బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు.

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌లలో

సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, నాయకులు గరిగిపోగుల చంద్రశేఖర్, నందారం సీతారాం, విద్యాసాగర్, జీవీ కృష్ణ తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతాఫల్‌మండి చౌరస్తాలో స్థానిక డివిజన్ టీడీపీ అధ్యక్షుడు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో, టీడీపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగే ప్రవీణ్ ఆధ్వర్యంలో పార్శీగుట్ట చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరిటాల విజయ్‌కుమార్, సుధాకర్, చంద్రమోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేబుల్ ఆపరేటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మూపిడి మధుకర్ అన్నారు. ఆదివారం కార్యక్రమానికి హాజరైన కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ముప్పిడి మధుకర్ బోయినపల్లిలోని నక్కబస్తీలో గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మణ్, భిక్షపతి, రాజు, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.

యాంటీ రేబిస్‌తో జూనోసిస్ రోగాలకు చెక్

పద్మారావునగర్ జూలై 6 (ఆంధ్రజ్యోతి): బోయగూడలోని పశు వైద్యశాలలో ఆదివారం ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకొని పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ వాక్సిన్‌ను ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అయోధ్య మాట్లాడుతూ ఏటా జూలై 6వ తేదీని ప్రపంచ జూనోసిస్ డేగా నిర్వహిస్తామని, 1885 జూలై 6న లూయిపాశ్చర్ శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా రేబిఎస్ వ్యాధినిరోధక టీకాను తయారు చేసి పిచ్చికుక్క కరిచిన 9 సంవత్సరాల బాలుడిపై ప్రయోగించి విజయం సాధించారని తెలిపారు. బాలుడికి ప్రాణాపాయం తప్పడంతో అప్పటి నుంచి ఏటా జూలై 6ను జూనోసిస్ డేగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధులను జూనోసిస్ వ్యాధులంటారని, వీటివల్ల ఏటా దేశంలో 30 నుండి 40 వేల మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధి ముఖ్యంగా కలుషిత నీరు, గాలి, పాలు, మాంసం ద్వారా ఎక్కువగా వ్యాప్తిస్తుందని, వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవుల ద్వారా వివిధ రకాలుగా జూనోసిస్ వ్యాధులు వ్యాపించి ప్రాణాలు తీస్తాయని, వివిధరకాల పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ఏటా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు దినేష్, స్వాతి, వెటర్నరీ అసిస్టెంట్లు రమేష్, ఉదయ్,కల్యాణ్, సిబ్బంది హేమంత్, మనీష్‌లు పాల్గొన్నారు.



మార్జాలానికి వ్యాక్సిన్ వేస్తున్న ప్రొఫెసర్ అయోధ్య, వెటర్నరీ వైద్యులు